

ఖమ్మం అర్బన్ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు చౌక బియ్యాన్ని దిగుమతి చేస్తున్న హమాలీలు (ఫైల్)



ఖమ్మం అర్బన్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద రేషన్ బియ్యం లోడుతో ఉన్న లారీ (ఫైల్)

# మూడు నెలల పరేషన్

మూడు నెలల రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు ఒకేసారి పంపిణీ చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అటు రేషన్ డీలర్లను, ఇటు వినియోగదారులను అవస్థలు పడేలా చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో ఓవైపు నిల్వ సామర్థ్యం లేకపోవడం, మరోవైపు జిల్లా అవసరాలకు సరిపడా బియ్యం రాకపోవడం, ఇంకోవైపు సమయానుకూలంగా కార్డుదారులకు సరఫరా కాకపోవడం వంటి సమస్యలు చుట్టుముడుతున్న వేళ.. రానున్న మూడు నెలల బియ్యాన్నీ జూన్ నెలలోనే పంపిణీ చేయాలన్న కేంద్రం ఆదేశాలు ఆందోళనకు కారణమవుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని కార్డుదారులకు పంపిణీ చేసేందుకు ప్రస్తుతం నెలకు అవసరమైన 6,434 మెట్రిక్ టన్నులు వస్తుంటేనే దిగుమతి చేసుకునేందుకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో తగినంత నిల్వ సామర్థ్యం గల గోదాములు లేకపోవడం వల్ల ఇప్పటికే ప్రతి నెలా వస్తున్న బియ్యాన్ని పొరుగు జిల్లాల్లో దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో మూడు నెలల బియ్యమూ ఒకేసారి వస్తే ఎలానో తెలియని అయోమయస్థితి ఏర్పడింది. పైగా మార్చి నెల వరకూ ఉన్న దొడ్డు బియ్యాన్ని రేషన్ షాపుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోకపోవడంతో ఆ బియ్యానికి పురుగులు పడుతున్నాయి.

–ఖమ్మం, మే 29

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో డీలర్లు, వినియోగదారులకు తప్పని అవస్థలు!
- బియ్యం సేకరణ, రవాణా నుంచి పంపిణీ వరకూ అన్నింటా అడ్డంకులే!
- భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలంటున్న కేంద్రం
- మూడు నెలలవి ఒకేసారి వస్తే గ్రామీణ రేషన్ షాపుల్లో నిల్వ సామర్థ్యం నిల్
- ప్రస్తుతం నెలకు 6,434 మెట్రిక్ టన్నులు వస్తుంటేనే దిగుమతికి ఇబ్బందులు
- పైగా ఇప్పటికే ఉన్న దొడ్డు బియ్యాన్ని షాపుల నుంచి వెనక్కు తీసుకోని రాష్ట్ర ప్రభుత్వం



భారీ వర్షాలు కురిసే అవకాశముందంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందస్తు చర్యల్లో భాగంగా రేషన్ కార్డుదారులకు ఆహార కొరతను రానీయకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు దేశ వ్యాప్తంగా రాబోయే మూడు నెలల (జూన్, జూలై, ఆగస్టు) కోటాను ఒకేసారి జూన్ నెలలోనే రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేసింది. అయితే తొలుత కేంద్ర నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదు. కేంద్రం ఇస్తున్న దొడ్డు బియ్యం స్థానంలో కార్డుదారులకు తాము సన్నబియ్యం పంపిణీ చేస్తున్నందున వాటి సేకరణకు, సరఫరాకు ఒక నెల గడువు కావాలని కోరింది. గడువు ఇవ్వడం కుదరదని, మూడు నెలల బియ్యాన్ని పేదలకు ఒకేసారి అందించాల్సిందేనని కేంద్రం తేల్చిచెప్పింది. దీంతో కేంద్ర ఆదేశాల మేరకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. అయితే, ఖమ్మం జిల్లా కార్డుదారులకు ఒకేసారి సరఫరా చేయాల్సిన బియ్యం జిల్లాలో లేకపోవడం పెద్ద అవరోధంగా ఉంది. ఒకవేళ అష్టకష్టాలూ పడి తెప్పించినా ఆ బియ్యాన్ని రేషన్ షాపులకు తరలించడంలోనూ, కార్డుదారులకు పంపిణీ చేయడంలోనూ అడ్డంకులు తప్పేలా లేవు.

### 2.19 కోట్ల కేజీల బియ్యం అవసరం..

ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లో 748 రేషన్ దుకాణాలున్నాయి. ఏఎఫ్ఎస్సీ కార్డులు 27,247, ఎఫ్ఎస్సీ కార్డులు 3,88,655, ఏఏపీ కార్డులు 3 కలుపుకొని 4,15,905 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలోని 12,03,943 మంది సభ్యులకు మూడు నెలలవి ఒకేసారి పంపిణీ చేయాలంటే 2,19,15,321 కేజీల బియ్యం అవసరం ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ బియ్యాన్ని తెప్పించేందుకు, పంపిణీ చేసేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### డీలర్లకు అవస్థలు..

జిల్లాలో 748 రేషన్ దుకాణాలున్నాయి. వాటిల్లో కొన్ని పెద్దవి.. మరి కొన్ని చిన్నవి ఉన్నాయి. గ్రామాల్లోని డీలర్లు తమ ఇంటి వద్దనే బియ్యాన్ని దిగుమతి చేసుకొని పంపిణీ చేస్తుంటారు. పట్టణాల్లోని డీలర్లు అద్దె గదుల్లో దింపుకొని కార్డుదారులకు సరఫరా చేస్తుంటారు. మరి మూడు నెలల బియ్యం ఒకేసారి వస్తే ఆయా గదులు సరిపోవంటూ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలవి మూడు విడతలుగా దిగుమతి చేసుకున్నా.. కార్డుదారులు కూడా మూడు దఫాలుగా చౌక దుకాణాలకు వచ్చి బియ్యాన్ని తీసుకెళ్లాల్సి ఉంటుంది. డీలర్లు కూడా నెల మొత్తమూ పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఇది ఇటు డీలర్లకు, అటు కార్డుదారులకు వ్యయప్రయాసలతో కూడుకున్న పని.

### బియ్యం నిల్వలు ఉన్నాయా?

ఏప్రిల్ నెల నుంచి రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. నెలకు సుమారు 6,434 మెట్రిక్ టన్నుల చొప్పున ఏప్రిల్, మే నెలల్లో ఖమ్మం జిల్లా కార్డుదారులకు అందించింది. అయితే, ఈ 6,434 మెట్రిక్ టన్నుల బియ్యం జిల్లాకు వస్తేనే ఇక్కడ నిల్వ సామర్థ్యం లేదు. దీంతో అధికారులు పొరుగు జిల్లాల్లో దిగుమతి చేస్తున్నారు. అలాగే, జిల్లాలో సన్నబియ్యం లేని కారణంగా ప్రతి నెలా 30 నాటికి రేషన్ దుకాణాలకు చేరాల్సిన బియ్యం.. ఆ తదుపరి నెల 15 వరకూ చేరుతూనే ఉన్నాయి. దీంతో పేదలకు పంపిణీ కూడా ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఆదేశం ప్రకారం మూడు నెలలకు కలిపి ఒకేసారి సుమారు 20 వేల క్వింటాళ్ల బియ్యం సేకరణపై కూడా సందేహాలున్నాయి. అన్ని బియ్యం లేవంటూ సాక్షాత్తూ ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. మరి కేంద్రం నిర్ణయం ప్రకారం మూడు నెలల బియ్యం ఒకేసారి రావడం, వాటిని పేదలకు పంపిణీ చేయాల్సి ఉండడం వంటివి ఎలా సాధ్యమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### చౌక దుకాణాలు, గోదాముల్లో దొడ్డు బియ్యం నిల్వలు

ఏప్రిల్ నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నందున్న మార్చి వరకూ వచ్చిన సుమారు మూడు వేల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం ఇటు రేషన్ షాపుల్లోనూ, అటు గోదాముల్లోనూ నిల్వ ఉన్నాయి. ఇప్పుడు మూడు నెలలకు సరిపడా సన్న బియ్యం తెచ్చి అదే గోదాములు, షాపుల్లో వేస్తే.. అప్పటికే నిల్వ ఉన్న దొడ్డుబియ్యంలోని పురుగులు సన్నబియ్యానికి కూడా పట్టే ప్రమాదం ఉంది.

### జూన్ నెల మొత్తం పంపిణీ ఉంటుంది..



కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మూడు నెలల బియ్యం పంపిణీ ప్రక్రియ జూన్ నెల మొత్తం ఉంటుంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు ఇప్పటికే దిగుమతి అవుతున్నాయి. రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని త్వరలోనే గోదాములకు తరలిస్తాం.

–చందన్‌కుమార్, డీఎస్‌వో, ఖమ్మం

# దళిత విద్యార్థులపై 'సెక్రటరీ' వివక్ష

**పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణి దిష్టిబొమ్మ దహనం**

ఖమ్మం అర్బన్, మే 29: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల రాష్ట్ర సెక్రటరీ అలుగు వర్షిణి విద్యార్థులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ సెంటర్‌లో గురువారం ఆమె దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేశ్ మాట్లాడుతూ పేద విద్యార్థులు బాత్రూంలు శుభ్రం చేసుకోవాలని, వంట చేసుకోవాలని, ఊడ్చుకొని తూడ్చుకోవాలని అంటూ ఒక ఐఏఎస్ అధికారి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దళిత విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం అంటే.. నిరుపేద దళిత విద్యార్థులను అవమానించడమేనా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దళిత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, యశ్వంత్, సందీప్, ప్రణవ్, ప్రసాద్, జీవన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

**విధుల నుంచి బహిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్**

దళిత విద్యార్థులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణిని విధుల నుంచి బహిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురుకులాల్లో చదివే విద్యార్థులతో పనులు చేయించుకుంటాం.. వాళ్లు వాడే టాయిలెట్లను వారే శుభ్రం చేసుకుంటే తప్పేంటి అని వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలనే ఆలోచనతోనే ఐఏఎస్ అధికారి ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అలుగు వర్షిణిని విధుల నుంచి తొలగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఖమ్మంలో గురుకులాల సెక్రటరీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

**కాంగ్రెస్ సర్కారులో రెండింతలైన జీలుగు, జనుము ధరలు**

**కేసీఆర్ సర్కారులో 30 కేజీల జీలుగులు రూ.1,116**

**40 కేజీల జనుము కూడా రూ.1,448కే అందజేత**

**కానీ నేటి రేవంత్ ప్రభుత్వంలో జీలుగులు రూ.2,138**

**రూ.2,510తో దాదాపుగా నూరు శాతం పెరిగిన జనుము**

**సొసైటీల్లో రెండు రెట్లయిన పచ్చిరొట్ట విత్తనాల ధరలు**


**రైతుల ఆశలపై నీళ్లు చల్లిన రేవంత్‌రెడ్డి సర్కారు**

# కొండెక్కిన పచ్చిరొట్ట

రఘునాథపాలెం, మే 29: సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పేరుతో కాంగ్రెస్ సర్కారు రైతన్నల ఆశలపై నీళ్లు చల్లింది. సహకార సొసైటీల్లో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగులు, జనుములు అందుబాటులో ఉన్నాయంటూ చెబుతూనే ధరలను మాత్రం రైతులకు అందనంత దూరం చేసింది. వానకాలం సీజన్‌లో పచ్చిరొట్ట విత్తనాల ధరలను రెట్టింపు చేసింది. పైగా సబ్సిడీపై ఇస్తున్నామంటూ అన్నదాతలను మోసం చేస్తోంది. పంట పొలాలను సారవంతం చేసేందుకు పచ్చిరొట్ట (జనుము, జీలుగు, పిల్లిపెసర) విత్తనాలను రైతులు వినియోగిస్తారు. గత కేసీఆర్ సర్కారు పాలనలో ఈ పచ్చిరొట్ట విత్తనాలపై సబ్సిడీ లభించింది. సేంద్రియ సాగులో భాగంగా భూసారాన్ని కాపాడేందుకు ఏటా ప్రభుత్వాలు పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందిస్తుంటాయి. గడిచిన పదేళ్లపాటు కూడా కేసీఆర్ ప్రభుత్వం అత్యధిక శాతం సబ్సిడీపై అందించింది. అదే మాదిరిగానే ఈ ఏడాది వానకాలంలో కూడా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ధరలను మాత్రం రెట్టింపు చేసింది. పైగా సహకార సొసైటీల్లో పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీ ధరలకే అందిస్తున్నామంటూ గొప్పలు చెబుతోంది. తీరా నిరుటి ధరలతో పోలిస్తే అది రెట్టింపుగా ఉన్నాయి. గత ఏడాది 30 కేజీల జీలుగులబస్తా ధర రూ.1,116గా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు దానిని రూ.2,138కు పెంచింది. 40 కేజీల జనుముల బస్తా నిరుడు రూ.1,448గా ఉంటే ఈ ఏడాది రూ.2,510 చేసింది. ఈ పంట పొలాలను సారవంతం చేసుకోవాలనుకునే రైతులు.. ఈ ఏడాది పచ్చిరొట్ట విత్తనాల ధరలను చూసి హడలిపోతున్నారు. ఈ ధరలను గతంలో ఎన్నడూ లేవని వాపోతున్నారు.



### సబ్సిడీ పేరుతో సర్కారు మోసం..



పచ్చిరొట్ట విత్తనాలపై సబ్సిడీ ఇస్తున్నామంటూ చెబుతున్న కాంగ్రెస్ సర్కారు.. ధరలను రెట్టింపు చేసి రైతులను మోసం చేస్తోంది. గత సంవత్సరంతో పోలిస్తే జీలుగులు, జనుములు విత్తనాల ధరల్లో చాలా వ్యత్యాసం ఉంది. నేలను సారవంతం చేసుకునేందుకు ఉపయోగించే పచ్చిరొట్ట విత్తనాలపై సబ్సిడీ మెరుగైన ఇవ్వలేకపోవడం దారుణం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రైతులపై భారాన్ని మోపుతూనే ఉంది. ధర తగ్గించి విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి. –గుత్తా రవి, రైతు, చిమ్మపూడి



లచ్చతండాలో బోరు వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

# తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

**15 రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఆవేదన**

టేకులపల్లి, మే 29 : దాస్‌తండా పంచాయతీ పరిధి లచ్చతండాలో ఉన్న బోర్ చెడిపోవడం, మిషన్ భగీరథ నీరు 15 రోజులుగా రాకపోవడంతో ఆవేదన చెందిన మహిళలు ఖాళీ బిందెలతో బోరు వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తండాలో ఏడాది నుంచి తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఉన్న ఒక్క చేతిపంపుపైనే 50 కుటుంబాలు ఆధారపడి నీటిని తెచ్చుకుంటున్నామని, దీంతో తెల్లవారుజాము నుంచే నీటి కోసం క్యూ కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అలాగే మిషన్ భగీరథ నీరు 15 రోజులుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తండాకు తాగునీటి సమస్య తీర్చాలని పలుమార్లు అధికారులు, నాయకులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ తండాకు తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికే ప్రాధాన్యం

- నూతన గనులు సాధించుకోవడానికి సంస్థలు కృషి చేయాలి
- కోలిండియా, సింగరేణిపై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కీలక సమీక్ష

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న సింగరేణి డైరెక్టర్లు





కొత్తగూడెం సింగరేణి, మే 29: ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్‌కు తగ్గట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తం చేసేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నడుం బిగించింది. రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించే క్రమంలో కోలిండియా సహా సింగరేణి సంస్థపై కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యమైన బొగ్గు సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఢిల్లీ నుంచి గురువారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రం దేవ్ దత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సింగరేణి సంస్థ తరఫున హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సీఎండీ బలరాం సమీక్షలో పాల్గొన్నారు. సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్ ప్రణాళికలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కూలంకశంగా వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. ఇందు కోసం కార్మిక సంఘాల సహకారం తీసుకోవాలని, పని సంస్కృతి మెరుగుపర్చాలని సూచించారు. అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపు కోసం సింగరేణి అధికారులు, బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీ వేయాలని సూచించారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్వీ సూర్యనారాయణరావు, వెంకటేశ్వర్లు, పీఅండ్‌పీ, పా ఈడీ ఎస్‌డీఎం సుభాని పాల్గొన్నారు.

# రిఫరల్ విధానం మానుకోండి..

- అన్ని జబ్బులకు సింగరేణి దవాఖానల్లోనే వైద్యం అందించాలి
- వైద్య పరికరాలు, మందుల ప్రతిపాదనలు వెంటనే పంపించండి
- అన్ని ఏరియాల వైద్యాధికారుల సమీక్షలో సింగరేణి సీఎండీ బలరాం



సమీక్షలో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, మే 29: కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు సింగరేణి ఆసుపత్రుల్లోనే పూర్తిస్థాయి వైద్యం అందించాలని, చిన్న జబ్బులకే హైదరాబాద్‌కు రిఫర్ చేయడం సరైన విధానం కాదని సింగరేణి సీఎండీ బలరాం వైద్యాధికారులకు సూచించారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల ఆస్పత్రుల ప్రధాన వైద్యాధికారులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రుల యాజమాన్యాలు తక్షణమే వారికి కావాల్సిన కనీస వైద్య పరికరాలు, అవసరమైన మందుల ప్రతిపాదనలు పంపించాలని, తన తదుపరి తనిఖీల్లో ఏ ఒక్క పరికరం లేదనే మాట రాకూడదని హెచ్చరించారు. ఇప్పటికే ఏరియా ఆస్పత్రులకు వైద్యులను పూర్తిస్థాయిలో కేటాయించామని, ఇంకా అవసరమైన వైద్యులు, టెక్నీషియన్లను సమకూర్చేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. చిన్న జబ్బులకే హైదరాబాద్ ఆసుపత్రులకు రిఫర్ చేయడం ద్వారా మూడేళ్లలో రూ.30 కోట్లు ఉన్న రిఫరల్ బిల్లులు ఇప్పుడు రూ.వంద కోట్లకు చేరాయన్నారు. గతంలో వైద్య సేవలకు నిధుల మంజూరులో అనేక ఆటంకాలు ఉండేవని, ఇప్పుడు ఎటువంటి కోతలు, తగ్గింపులు లేకుండా నిధులు మంజూరు చేయడానికి యాజమాన్యం సిద్ధంగా ఉన్నారు. కొవిడ్ వ్యాప్తి చెందిన క్రమంలో దానిని ఎదుర్కొనేందుకు అన్ని ఏరియా ఆసుపత్రుల్లో తగిన విధంగా సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణరావు, వెంకటేశ్వర్లు, ఈడీ సుభాని, జీఎంలు ఎన్‌వీ రాజశేఖర్‌రావు, సీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వంద శాతం వ్యాక్సినే లక్ష్యం

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతిబాయి**



మాట్లాడుతున్న ఖమ్మం డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి

ఖమ్మం సిటీ, మే 29: జిల్లాలోని చిన్నారులకు వంద శాతం వ్యాక్సిన్ వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 97 శాతం వ్యాక్సిన్‌ను ఎస్టిమెటేడ్ చిల్డ్రన్స్‌కు వేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాబు తెలిపారు. రోటా వైరస్, ఇతర వ్యాక్సిన్లపై ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జిల్లా వైద్యారోగ్య శాఖ ఒక్కరోజు ఓరియంటేషన్ ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వ్యాక్సిన్ గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలపై ఉందన్నారు. వ్యాక్సిన్ చిన్నారులను దాదాపు ఎనిమిది రకాల ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి కాపాడుతుందన్నారు. వ్యాక్సిన్ వేసిన రోజు కొందరు పిల్లలకు ఆబ్సెస్ అవుతుందని, కొద్దిగా జ్వరం కూడా వస్తుందని, అంతమాత్రాన భయపడాల్సిన అవసరం లేదన్నారు. వ్యాక్సిన్ వివరాలను మాతా, శిశు సంరక్షణ కార్డులో నమోదు చేయాలని, డ్యూ డేట్ కూడా తప్పక పొందుపరచాలన్నారు. కాగా.. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చందునాయక్, డబ్ల్యూహెచ్‌వో రాష్ట్ర శిక్షకులు డాక్టర్ మురహరి రోటా వైరస్ గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామారావు, డెమో సుబ్రహ్మణ్యం, డీపీహెచ్‌ఎన్‌వో శేషురత్నం, డీపీఎల్‌ఎం రమణ, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.